శేరిలింగంపల్లి జెడ్‌సీగా హేమంత్



గచ్చిబౌలి: జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్‌గా హేమంత్ సహదేవ్ రావు భోర్ఖాడే బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ జెడ్‌సీగా ఉన్న ఉపేందర్‌రెడ్డిని హెచ్‌ఎండీఏ సెక్రటరీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో హేమంత్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ వైద్య సేవల సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఐఎండీసీ) ఎండీగా పని చేస్తున్న ఆయనను జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌గా బదిలీ చేసిన విషయం తెలిసిందే. 2018 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి హేమంత్ గతంలో కొమురం భీం కలెక్టర్‌గా, జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోన్‌లో పని చేసిన అనుభవం ఉంది.

వైభవంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ జనప్రియ నగర్ ఫేజ్ 2లోని అభయ ఆంజనేయ స్వామి దేవాలయ పుష్కర (బ్రహ్మోత్సవ) వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు నిమ్మల ధాత్రినాథ్ గౌడ్, జయసూర్య, మల్లికార్జున్, సత్యనారాయణ, కిషోర్, కొండల్‌రావు, బాలాజీ, కిరణ్, సుధాకర్, దాస్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేస్తేనే గుర్తింపు



ఉద్యోగ విరమణ చేసిన వారితో కమాండెంట్ రామకృష్ణ

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో ఏఆర్‌ఎస్ఐ బి.వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ చేశారు. ఆయనను బెటాలియన్ కమాండెంట్ ఎం.రామకృష్ణ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ ఉద్యోగులకు ఏదో ఒక రోజు పదవీ విరమణ తప్పదన్నారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు కష్టపడి పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో 8వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ బి.సీతారామ్, ఎస్.రాంబాబు, ఎం.నాగభూషణం, ఎం.పార్థసారథిరెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చీరలను పంపిణీ చేస్తున్న రవికుమార్ యాదవ్

చందానగర్: అలిగిరి వెంకటేష్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం చందానగర్ స్వాగత్ హోటల్ ముందు చలివేంద్రంను బీజేపీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి రవికుమార్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అలిగిరి అర్జున్‌రావు ఆధ్వర్యంలో మహిళలకు రవికుమార్ యాదవ్ చీరలు పంపిణీ చేశారు. స్థానిక నేతలు విజయ్, నవీన్, వసంత్, అఖిల్, జాన్ వెస్లీ, సుభాష్, హరీష్, శామ్యూల్, వెంకీ, వెంకటేష్, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వరుడి బోధనలు ఆదర్శనీయం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



రామచంద్రాపురం(పటాన్‌చెరు): విశ్వగురు మహాత్మ బసవేశ్వరుడి బోధనలు నేటి తరానికి ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. రామచంద్రాపురం పట్టణంలో బసవేశ్వరుడి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. రామచంద్రాపురం బీరంగూడ కమాన్ వద్ద బసవేశ్వరుని విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మ బసవేశ్వరుని బోధనలు ప్రతీ ఒక్కరికి అందించాలన్న లక్ష్యంతో బీరంగూడ కమాన్ వద్ద సొంత నిధులు రూ.30 లక్షలతో బసవేశ్వరుని విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆయన అనుసరించిన మార్గాన్ని భావితరాలు ఆచరించాలని సూచించారు. అనంతరం కార్పొరేటర్ పుష్ప, నియోజకవర్గ బీఆర్ఎస్ కోఆర్డినేటర్ వి.ఆదర్శ్‌రెడ్డి బసవేశ్వరుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

శంకుస్థాపనతో సరి!



ఇందిరానగర్‌బస్తీలో ఒకే భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ, బస్తీ దవాఖానా

- కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 20 లక్షలు
- ఖాళీ స్థలం ఉన్నా ముందుకు సాగని కమ్యూనిటీ హాల్ పనులు
- ఒకే భవనంలో అంగన్‌వాడీ కేంద్రం, బస్తీ దవాఖానా
- ప్రజలకు తప్పని ఇబ్బందులు

చందానగర్: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ప్రతి కాలనీ, బస్తీలలో సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మించారు. అందులో భాగంగా చందానగర్ డివిజన్ ఇందిరానగర్ బస్తీవాసుల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇందుకోసం రెండేళ్ల క్రితం రూ. 20 లక్షలు మంజూరు చేశారు. అయినా ఇప్పటికీ నిర్మాణ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. కమ్యూనిటీ హాల్ కోసం ఖాళీ స్థలం ఉన్నా నిర్మించక పోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఖాళీ స్థలాన్ని ఆనుకొని ఉన్న బస్తీ దవాఖానా, అంగన్‌వాడీ కేంద్రాలు రెండు కలిసి ఒకే భవనంలో ఉండటంపై సర్వత్రా నిరసన వ్యక్తం అవుతోంది. రెండు ఒకే భవనంలో ఉండటంతో ఆ భవనం ఇరుకుగా మారి రోగులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

- భవనం చుట్టు పక్కల చెత్తాచెదారం వేస్తున్నారు. అక్కడే ఉన్న మరుగుదొడ్లు దుర్గంధంగా మారాయి. బస్తీ దవాఖానాలో వైద్యులకు, రోగులకు కనీస వసతులు లేవు. దవాఖానాలలో మంచినీటి కనెక్షన్ లేకపోవడం, పారిశుద్ధ్యంపై అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బస్తీ దవాఖానాలో ఒక డాక్టర్, ఇద్దరు నర్సులు విధులు నిర్వహిస్తున్నారు. వారికి కూడా కనీసం వసతులు కల్పించలేకపోవడంపై ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



శంకుస్థాపన చేసిన శిలాఫలకం

చర్యలు తీసుకోవాలి



బస్తీ దవాఖానా, అంగన్‌వాడీ కేంద్రం ఆవరణంలో చెత్తాచెదారంతో పాటు మట్టి పోస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. దవాఖానా చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలి. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు చోటుకేసుకోకుండా పటిష్ట భద్రత అవసరం.

– రవి, ఇందిరానగర్‌బస్తీ

పనులు ప్రారంభించాలి



రెండేళ్లుగా శంకుస్థాపనకే పరిమితం కావడం దారుణం. ఇకనైనా జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో వ్యవహరించి కమ్యూనిటీ హాల్ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి.

– రాజేశ్వరాచారి, ఇందిరానగర్‌బస్తీ

- కమ్యూనిటీ నిర్మాణం పనులు వెంటనే ప్రారంభించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అంగన్‌వాడీ ముందు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఉన్న ఖాళీ స్థలం



బస్తీ దవాఖానా పక్కన ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

భూములకు రక్షణ కవచంలా భూ భారతి చట్టం



సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, రాజేంద్రనగర్ ఆర్‌డీఓ వెంకట్‌రెడ్డి తదితరులు

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: భూ భారతి చట్టం భూములకు రక్షణ కవచం లాంటిదని, రైతులకు భూ భద్రత కల్పిస్తుందని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. బుధవారం శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కార్యాలయంలో భూ భారతి చట్టం–2025పై అవగాహన సదస్సులో రాజేంద్రనగర్ ఆర్‌డీఓ వెంకట్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి ఆర్‌ఓఆర్ నూతన చట్టంలో పొందుపరిచిన అంశాలు రైతుల సమస్యలకు పరిష్కారం చూపుతాయని తెలిపారు. భూ భారతి చట్టంలో అప్పీల్ వ్యవస్థ చాలా కీలకమని, ఆర్‌డీఓ, కలెక్టర్, సీసీఎల్ఏ స్థాయిలో అప్పీల్ చేసుకునేందుకు వీలుంటుందన్నారు. భూ వివాదాలకు స్థానం లేకుండా భూమి హక్కులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ కర్తవ్యమన్నారు. గతంలో భూ సమస్యలు వస్తే కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదని, 90 శాతం సమస్యలు తహసీల్దార్ వద్దే పరిష్కారమయ్యే అవకాశం ఉందన్నారు. భూ భారతి చట్టంపై అవగాహన కల్పించుకోవాలని ఆయన సూచించారు. నానక్‌రాంగూడ సర్వే నెంబర్ 149లో ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఏడు ఎకరాల భూమి రాత్రికి రాత్రి చేతులు మారిందన్నారు. అక్రమంగా జీఓ నెంబర్ 59లో క్రమబద్ధీకరించారని ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సర్వే నెంబర్ 101లో 250 గజాల స్థలం ఉంటే 750 గజాలకు పట్టాలు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. వందల కోట్ల విలువైన స్థలాన్ని క్రమబద్ధీకరించిన అధికారులు, కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లిలో పెద్ద సంఖ్యలో ల్యాండ్‌గ్రాబర్స్ ఉన్నారని, రెవెన్యూ అధికారులు సీరియస్‌గా తీసుకోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఉన్న ధరణి, ప్రస్తుతం ఉన్న భూ భారతి చట్టాల మధ్య వ్యత్యాసాలను, మార్పులను, నూతన చట్టంలోని సవరణలను ఆర్‌డీఓ వెంకట్ రెడ్డి వివరించారు. నాలా కన్వర్షన్, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, కెడస్ట్రల్ మ్యాప్‌ల సమస్యలపై భూ భారతిలో ఎలాంటి పరిష్కారాలు చూపారని పలువురు బిల్డర్లు సందేహాలను వెలిబుచ్చారు. గ్రామాల మధ్య ఉన్న ఓవర్ లాపింగ్, ప్రొహిబిటెడ్ స్థలం ఉంటే మొత్తం సర్వే నెంబర్ బ్లాక్ చేస్తున్నారని బిల్డర్లు పేర్కొన్నారు.. సామాన్యులు, బిల్డర్లు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. శేరిలింగంపల్లి తహసీల్దార్ వెంకారెడ్డి, కార్పొరేటర్లు జగదీశ్వర్ గౌడ్, రాగం నాగేందర్ యాదవ్, హమీద్‌పటేల్, ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాస్, నాయకులు రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఫలితాలతో సత్తాచాటిన 'గురుకులం'

పాఠశాల టాపర్‌గా 583 మార్కులు సాధించిన జ్యోతి



సి.హెచ్.జ్యోతి (583)



ఎ.తేజశ్రీ (580)



ఎ.హరిణి (574)



జె.మేఘన (573)



ఎ.అఖిల (571)

రాయదుర్గం: గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించారు. పాఠశాల ప్రిన్సిపల్ కల్పన పదవ తరగతి ఫలితాలను వివరించారు. పాఠశాల నుంచి 74 మంది విద్యార్థినులు పదవ తరగతి పరీక్షలు రాయగా అందులో మొత్తం 74 మంది ఉత్తీర్ణులు అయ్యారని వివరించారు. పాఠశాల టాపర్‌గా సి.హెచ్ జ్యోతి 583 మార్కులు సాధించి నిలిచారు. తేజశ్రీకి 580, హరిణి 574, జె.మేఘన 573, అఖిల 571 మార్కులు సాధించి పాఠశాల టాపర్లుగా నిలిచారు. సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి, అదనపు కార్యదర్శి సంతోషి, ఓఎస్‌డీ వివేకానంద, అకడమిక్ సంయుక్త కార్యదర్శి సక్రూనాయక్, స్టేట్ ఆఫీసర్ భీమయ్య విద్యార్థులను అభినందించారు.

ఘనంగా బసవేశ్వర జయంతి



చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: శ్రీ మహాత్మా బసవేశ్వర జయంతిని బుధవారం చందానగర్ హుడా కాలనీలోని హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ బసవేశ్వర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్య, సమాజం, సమానత్వం కోసం పోరాటం చేసిన మహనీయుడు, సామాజిక ఆధ్యాత్మిక విప్లవకారుడు బసవేశ్వరుడు అని అన్నారు. స్త్రీ, పురుష అసమానతలు తొలగించడానికి కృషి చేసిన అభ్యుదయవాది అని, దళితులకు ఆలయ ప్రవేశం కల్పించిన ప్రగతిశీలి అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం 200 మంది పారిశుద్ధ్య, పేద మహిళలకు చీరల పంపిణీ చేశారు. కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, మల్లికార్జున్, నరేందర్ బల్లా, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి హైస్కూల్‌లో 68 శాతం ఉత్తీర్ణత

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండల పరిధిలోని జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో ఎస్ఎస్‌సీ ఫలితాల్లో 68 శాతం ఉత్తీర్ణత సాధించారు. తెలంగాణ ప్రభుత్వం బుధవారం ప్రకటించిన ఫలితాల్లో మండల పరిధిలోని మొత్తం 13 హైస్కూల్స్‌లోని 1094 మంది విద్యార్థులకు 757 మంది విద్యార్థులు (68 శాతం) ఉత్తీర్ణత సాధించారు. కొండాపూర్ హైస్కూల్‌లో 107 మంది విద్యార్థులకు 83 మంది, మియాపూర్ హైస్కూల్‌లో 159 విద్యార్థులకు 99 మంది, మక్తామహబూబ్‌పేట్ స్కూల్‌లో 41కి మందికి 25 మంది ఉత్తీర్ణత సాధించారు. శేరిలింగంపల్లి హైస్కూల్‌లో 168 మందికి 85 మంది, లింగంపల్లి హైస్కూల్‌లో 56 మందికి 33 మంది (59 శాతం), గచ్చిబౌలి హైస్కూల్‌లో 100 మంది విద్యార్థులకు 78 మంది, మదాపూర్ హైస్కూల్‌లో 104కు 74 మంది, ఖాజాగూడ హైస్కూల్‌లో 47 మంది విద్యార్థులకు 29 మంది, కొత్తగూడ హైస్కూల్‌లో 129 మందికి గాను 108 మంది, రాయదుర్గం హైస్కూల్‌లో 121 మందికి 94 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. న్యూ హఫీజ్‌పేట్ ఉర్దూ మీడియం స్కూల్‌లో 29 మందికి 24 మంది విద్యార్థులు, దర్గా ఉర్దూ మీడియం స్కూల్‌లో 18 మందికి 15 మంది, వేముకుంట ఉర్దూ మీడియం స్కూల్‌లో 15 మంది విద్యార్థులకు 9 మంది ఉత్తీర్ణత సాధించారు.

సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మాదాపూర్: ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో తమవంతు సాయం చేయాలని సినీనటుడు రాజారవీందర్ తెలిపారు. మాదాపూర్‌లో చలివేంద్ర కేంద్రం, ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. బ్లిస్‌బర్గ్ ఫ్యూచర్ ఆఫ్ హోప్ సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ఎన్నో సేవలను అందిస్తుందన్నారు. విద్య, ఆరోగ్యం, సామాజిక సేవారంగాల్లో సేవలు అందిస్తున్నందుకు సంతోషాన్ని వ్యక్తపరిచారు. రాజ్ న్యూస్ చానల్ చైర్మన్ లక్ష్మీరావు, దర్శకుడు వాసు, జెనిసిస్ ఇన్ఫోఎక్స్ అధినేత డాక్టర్ సరికొండ వినయ్, కార్డియాలజిస్ట్ విశ్వనాథ్ , సిగ్మా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నెలలోనే పింఛను పత్రాలు



చందాదారులకు పీపీఓ పత్రాలను అందజేస్తున్న విశాల్ అగర్వాల్

ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ విశాల్ అగర్వాల్

పటాన్‌చెరు టౌన్: పదవీ విరమణ పొందిన నెలలోనే పింఛను ప్రయోజనాలను మంజూరు చేసే ప్రక్రియను క్రమబద్ధీకరించి నెలలోనే వారికి సంబంధించిన పత్రాలు (పీపీఓ) అందేలా చర్యలు తీసుకున్నట్లు ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కమిషనర్ విశాల్ అగర్వాల్ పేర్కొన్నారు. ఏప్రిల్ నెలలో పదవీ విరమణ పొందిన 56 చందాదారులకు పీపీఓలను జారీ చేసి అందులో 26 మందికి కార్యాలయంలో బుధవారం అందజేశారు. అనంతరం లబ్ధిదారులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్–2 ప్రశాంత్ ప్రియదర్శి, అకౌంట్ ఆఫీసర్ అబ్దుల్ అజీమ్ పాల్గొన్నారు.

టీజీఐసీ చొరవతో అద్భుత విజయం

టీజీఐసీ సీఈఓ మెరాజ్ ఫహీమ్

రాయదుర్గం: తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ (టీజీఐసీ) చొరవతోనే అద్భుతమైన విజయం సాధిస్తోందని టీజీఐసీ సీఈఓ మెరాజ్ ఫహీమ్ పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీవర్క్స్‌లోని టీజీఐసీ కార్యాలయంలో రెండవ దశలో టీజీఐసీతో మరో 9 కళాశాలలతో ఒప్పందం కుదుర్చుకున్నారు. టీజీఐసీ సీఈఓ మెరాజ్‌ఫహీమ్ సమక్షంలో ఒప్పందంపై అధికారులు, కళాశాలల ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలోని 30 జిల్లాల్లో టీజీఐసీ కార్యక్రమాలు ప్రభావవంతమైన వ్యాప్తి చెందుతోందన్నారు. మొదటి దశలో 18 కళాశాలలతో ఒప్పందం కుదుర్చుకున్నామని, ప్రస్తుతం రెండవ దశలో 9 కళాశాలలతో ఒప్పందం కుదుర్చుకున్నామని ఆయన వివరించారు. ఈ ఒప్పందాలతో తెలంగాణ రాష్ట్ర మంతటా బలమైన, సమగ్ర ఆవిష్కరణ, పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి టీజీఐసీ నిబద్ధతను నొక్కి చెబుతుందన్నారు. టీజీఐసీ అధికారులు, ఉద్యోగులు, 9 విద్యాసంస్థల అధికారులు పాల్గొన్నారు.

పార్టీకి సమయం ఇచ్చే వారికే పదవులు

బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేష్

మణికొండ: రాష్ట్రంలో అధికారమే ధ్యేయంగా పార్టీని తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందని, రాబోయే రోజుల్లో అలాంటి నాయకులను గుర్తించి పార్టీకి ఎక్కువ సమయం ఇచ్చే వారికే పదవులను అప్పగిస్తామని బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేష్ అన్నారు. బుధవారం నార్సింగి మున్సిపాలిటీ కోకాపేటలో పార్టీ ముఖ్య నాయకులు, క్రియాశీలక సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పార్టీకి మరింత సమయం ఎక్కువగా పనిచేయాల్సి ఉంటుందని, అలాంటి వారు పదవులకు న్యాయం చేస్తామనుకునే వారు పార్టీ పదువులకు తమ పేర్లను ఇవ్వాలన్నారు. అలాంటి వారి పేర్లతో త్వరలోనే మున్సిపాలిటీ, నియోజకవర్గ, జిల్లా కమిటీలను ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నార్సింగి మున్సిపల్ అధ్యక్షుడు ఎం.నగేష్‌యాదవ్, ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ, మున్సిపల్ మాజీ అధ్యక్షుడు సి.హెచ్.భిక్షపతియాదవ్, మాజీ కౌన్సిలర్ ఆర్. ఆదిత్యరెడ్డి, నాయకులు శివరాజ్, నర్సింగ్ రావు, శేఖర్ అప్ప, కిరణ్, బ్రహ్మచారి, సాయి కిరణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లిలోని మహవీర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభకనబరిచి పోటీల్లో మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను బుధవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అభినందించి సన్మానించారు. 3వ ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్ ఉషు చాంపియన్ షిప్ 2025ను అమెచూర్ ఉషు అసోసియేషన్ సిరిసిల్ల డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు పద్మ నాయక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో మైలార్‌దేవ్‌పల్లిలోని మహవీర్ మార్షల్ ఆర్ట్స్ ఉషు అకాడమీ విద్యార్థులు పి.ప్రణవ్ డబుల్ షాట్ వెబ్‌లో సిల్వర్ మెడల్, శ్రీకాంత్ డబుల్ షాట్ వెబ్, నన్ కాన్ టైప్‌లో రెండు బ్రాన్జ్ మెడల్స్ సాధించారు. రానున్న రోజుల్లో మరిన్ని పోటీల్లో పాల్గొని సత్తాచాటాలని ఈ సందర్భంగా విద్యార్థులను ఎమ్మెల్యే ప్రోత్సహించారు. కార్యక్రమంలో కోచ్ సంతోష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.